www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 జనవరి 2024
5
తిరుపతి





జెసిబితో అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న దృశ్యం

హామీల వి'(ఎ)స్మ'రణ

'ఎస్మా' నోటీసులు దగ్ధం
26వ రోజూ అంగన్‌వాడీల సమ్మె
రిలే నిరాహారదీక్షలు ప్రారంభం
కళ్లకు గంతలతో శిబిరాల్లో నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

రాష్ట్రంలో అంగన్వాడీలకు వర్తించని ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ద్వారా వారిని భయపెట్టాలనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి హెచ్చరించారు. అత్యవసర పనులుగా భావించబడే నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, ఆసుపత్రుల్లో ఎస్మా చట్టం వర్తిస్తుందని, అత్యవసర పనులకు ఏమాత్రం సంబంధం లేని అంగన్వాడీలపై ప్రయోగించడం చూస్తుంటే ప్రభుత్వ పిరికితనం అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా కేంద్రమైన తిరుపతిలో రిలే నిరాహారదీక్ష ప్రారంభమయ్యింది. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుంచి వచ్చిన నాయకులతో నిరాహారదీక్షలను అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణీశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రకేంద్రంలోనూ, జిల్లాలోనూ రిలే నిరాహారదీక్షలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ప్రాజెక్టు స్థాయిలో దీక్షా శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు.

తిరుపతి సిడిపిఒకు నిరసన సెగ

తిరుపతి ప్రాజెక్టు సిడిపిఒ సుధారాణికి అంగన్వాడీల నిరసన సెగ తగిలింది. ఎస్మా చట్టానికి సంబంధించిన ప్రతులను అంగన్వాడీలకు అందించడానికి శనివారం సాయంత్రం దీక్షా శిబిరం దగ్గరకు వచ్చిన సిడిపిఒ సుధారాణిని అంగన్వాడీలు పెద్ద ఎత్తున చుట్టుముట్టి నిరసన తెలిపారు సమస్యలు పరిష్కరించకుండా నోటీసులు ఇవ్వడం ఏంటని నినాదాలు చేశారు. సిడిపిఒ ప్రతులను ఇవ్వాలని విఫల యత్నం చేసి అంగన్వాడీలు నోటీసులు తీసుకోకపోవడంతో చేసేది లేక మౌనంగా వెనుదిరిగారు.

కళ్లకు గంతలతో నిరసన

అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని, చీకటి చట్టాలతో ఉద్యమాలను ఆపలేరని తెలుపుతూ అంగన్వాడీలు నల్లటి రిబ్బన్‌తో కళ్ళకు గంతలు కట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. మొదటిరోజు రిలే నిరాహార దీక్షలో వివిధ ప్రాజెక్టుల నుంచి విచ్చేసిన అంగన్వాడీ నేతలు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌజన్య, పుష్ప, రేవతి, గంగా, ధనమ్మ, హైమావతి, శాంతి, సిఐటియు నగర కార్యదర్శి వేణుగోపాల్, నేతలు టి. సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగించారు.

– శ్రీకాళహస్తిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంఘీభావం ప్రకటిస్తూ సిఎం జగన్ 'నీరో చక్రవర్తి'లా రాష్ట్రం తగలబడుతుంటే వేడుక చూస్తున్నారని విమర్శించారు. 26 రోజులుగా సుదీర్ఘ పోరాటం చేస్తుంటే ఎస్మా జీవో నంబర్2ను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. జీవో కాపీలను దహనం చేశారు. జగన్‌నిర్మిస్తున్న ప్యాలెస్‌కు రూ.450 కోట్లు ఖర్చు పెట్టే బదులు మరో రూ.50 కోట్లు జత చేసి అంగన్‌వాడీల వేతనాలు పెంచితే సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారని సూచించారు. నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, రాజా, రేవతి, పుష్ప, సౌజన్య పాల్గొన్నారు.

– గూడూరు టౌన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. అంగన్‌వాడీలు 26 రోజులుగా సమ్మెచేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదన్నారు. ఇంద్రావతి, జోగి శివకుమార్, సురేష్, బి.వి రమణయ్య పాల్గొన్నారు.

– పిచ్చాటూరులో నల్లరిబ్బన్లను కట్టుకుని, జీవో కాపీలను తగలబెట్టారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం చట్టవిరుద్ధమని సిఐటియు నాయకులు నాగరాజు, యూనియన్ నాయకులు ఇంద్రాణి, రాజేశ్వరి అన్నారు.

– నాయుడుపేటలో ఎస్మా చట్టం జీవో 2 కాగితాలను దహనం చేశారు. సిఐటియు నాయకులు శివకవి ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకురాలు ఎన్.శ్యామలమ్మ, నాగమణి, కళావతి, సంధ్య, వాణి, చెంగమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

– పుత్తూరులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది. అంబేద్కర్ సర్కిల్ వద్ద నడిరోడ్డులో భోజనాలు చేశారు. జీవో కాపీలను దహనం చేశారు. విజయకుమారి, మోహన్‌లక్ష్మి, అన్నపూర్ణ, హైమావతి,లలిత తదితరులు పాల్గొన్నారు.

– రేణిగుంటలో నల్లరిబ్బన్లు కట్టుకుని, మోకాళ్లపై నిరసన తెలిపారు. నాయకులు హరినాథ్, సెల్వరాజ్, మురళి, నర్సింహారెడ్డి, కుప్పస్వామి, ఒ.వెంకటరమణ మద్దతు తెలిపారు.

– సత్యవేడులో నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు మేరకే సమ్మె జరుగుతోందన్నారు. కాంతమ్మ, భారతి, ఝాన్సీ, నాగరాజు, స్వర్ణలత, గీత పాల్గొన్నారు.

– వెంకటగిరిలో సిఐటియు నాయకులు వడ్డిపల్లిచెంగయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు ఎ.మంజుల, జ్యోతి, ఉమ, సుభాషిణి, ప్రియ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.

– తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్మా ప్రయోగం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి మండిపడ్డారు.



పుత్తూరులో రోడ్డుపైనే అంగన్‌వాడీల భోజనాలు



శ్రీకాళహస్తిలో..



రేణిగుంటలో కళ్లకు గంతలతో



తిరుపతిలో...

మఠం స్థలంలో ఆక్రమణలు కూల్చివేత

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం):

శ్రీ స్వామీ హథీరాంజీ మఠానికి చెందిన పుదిపట్ల గ్రామ సర్వే నెంబరు 9/1 లోని 2ఎకరాల 17 సెంట్ల భూమిలో కె.వెంకటేష్ అనే వ్యక్తి అక్రమంగా రేకుల షెడ్, ప్రహరీ గోడను నిర్మించడంతో సమాచారం అందుకున్న హథీరాంజీ మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు మఠం సిబ్బందిని వెంటబెట్టుకుని అక్రమంగా నిర్మించిన షెడ్డును శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు మాట్లాడుతూ మఠంకు చెందిన సదరు స్థలంలో అక్రమంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని పలుమార్లు వెంకటేష్ అనే వ్యక్తికి సిబ్బంది ద్వారా సమాచారం అందించినా అతను ఖాతరు చేయక అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తూ వచ్చారన్నారు. సదరు స్థలంలో గతేడాది అక్టోబర్ 9వ తేదీన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, బోర్డు సైతం తీసివేసి అక్రమ నిర్మాణ పనులు కొనసాగించాడన్నారు. దీనిపై అక్టోబర్ 11న ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు.

అక్రమ నిర్మాణదారుడికి దేవాదాయ దర్మాదాయ చట్టం 30/1987 లోని సెక్షన్ 83 ద్వారా గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన నోటీసు ఇవ్వగా, ఆ నోటీసుకు ఎటువంటి ప్రతి స్పందన రాలేదన్నారు. శనివారం ఉదయం మఠం సిబ్బంది, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, జిల్లా ఎండోమెంట్ అధికారి సహకారంతో పుదిపట్ల గ్రామ సర్వే నెంబరు 9/1లో చేపట్టిన అక్రమ కట్టడాలను జెసిబి యంత్రాలతో తొలగించడం జరిగిందన్నారు.



తొలగించిన నిర్మాణ శిథిలాలను మఠం స్థలం నుండి ఖాళీ చేయడానికి రెండు రోజులు గడువు ఇచ్చామన్నారు. మఠంకు చెందిన భూములలో ఏదైనా అక్రమ నిర్మాణాలు చేపడితే దేవాదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరలో ఆ షాపులను స్వాధీనం చేసుకుంటాం...

తిరుపతి పట్టణంలో గాంధీ రోడ్డు, పాత టిటిడి ఆఫీసు రోడ్డు, ప్రకాశం రోడ్డు, జిఎన్ మాడా స్ట్రీట్, కర్నాల వీది, కోలా విధి, బేరివీధి, అనంత విధి. ఆర్ఎస్ మాడా స్ట్రీట్, తిరుచానూరులోని మఠం భవనంలో వున్న సుమారు 128 షాపులకు 2019 సంవత్సరములోనే కాలం ముగిసినప్పటికీ, అప్పటి మహంత్ అర్జున్ దాస్ పట్టించుకోలేదన్నారు. వీరందరికీ దేవాదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చిన స్పందించలేదని, త్వరలో ఈ షాపులను కూడా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.



గూడూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు : చింతామోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు' అని రాబోవు రోజుల్లో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌కు డిపాజిట్లు సైతం రావని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు.గూడూరు పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ప్రత్యేక హోదా..ఆంధ్రుల హక్కు' అంటూ నినదించారు. అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెబాట పట్టారని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆందోళన ప్రదేశ్‌గా మారిందన్నారు. డబ్బు ఇస్తేనే ఈ ప్రభుత్వంలోపనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, రాష్ట్రానికి రపత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులురెడ్డి, పుల్లా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పాఠశాలలో సంక్రాంతి సంబరాలు'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

స్థానిక బైరాగి పట్టెడలోని మహాత్మా గాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలలో 15వ వార్డు కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేష్ రెడ్డి ఆధ్వర్యంలోసంక్రాంతి సంబరాలు ముందస్తుగా అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరపాలక డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి హాజరయ్యారు. గౌరవ అతిథిగా రాయలసీమ సంస్థల అధినేత ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భోగిమంటలు, పొంగళ్ళు ,పూజా కార్యక్రమం, గంగిరెద్దులు ,గాలిపటాల పోటీలు, ముగ్గుల పోటీలు ,సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి .ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పట్టణ విద్యార్థులకు గ్రామీణ సంస్కృతి సాంప్రదాయాలు మరిచిపోకుండా నిర్వహించడం అభినందనీయమని తెలియజేస్తూ పట్టణ ప్రజలకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తిరుపతి నగరపాలక హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ, భాస్కర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక వైసీపీ నాయకులు తూకివాకం మహేష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురుగన్ ,మాజీ ప్రధానోపాధ్యాయులు అరుణ ,ఉపాధ్యాయులు బండి మధుసూదన్ రెడ్డి , రవికుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, తిరుపతి సిటీ

'చట్టాలు– హక్కుల'పై బాలికలు విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసులు నాయక్ సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాసాగార్డెన్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం శ్రీకాళహస్తి కోర్టు ఆధ్వర్యంలో చట్టాలు–హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాల్యవివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టాల గురించి విశదీకరించి చెప్పారు. బాలికలు చైతన్యవంతులైతేనే వారిపై జరుగుతున్న లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందగలరని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రభావతి, న్యాయవాదులు మల్లిఖార్జునయ్య, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జిలతో చట్టాల పై అవగాహన కార్యక్రమం శనివారం స్థానిక యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ గల్లా సుదర్శన్ రావు, తిరుపతి బార్ అసోసియేషన్ మెంబర్ వెంకట్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి అన్వర్ భాష చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం 27/2022, సెక్షన్ 41 ఏ సిఆర్పిసి, హిందూ సక్సేషన్ యాక్ట్ పై న్యాయవాదులకు అవగాహన కల్పిస్తూ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి 10వ అడిషనల్ డిస్టిక్ జడ్జి రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ టి గోపీచంద్, ఏ.రాజశేఖర్ పాల్గొన్నారు.



18వ రోజు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె 18వ రోజు శనివారం తిరుపతి పాత కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కొనసాగింది. శుక్రవారం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన 'చలో విజయవాడ' విజయవంతమైందని, వేలాదిగా ఉద్యోగులు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియజేశారని సంఘం గౌరవాధ్యక్షులు గండికోట బాలాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులచే దుర్మార్గంగా అరెస్టు చేయించి కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూసిందని, అయినా ఉద్యోగులు ఐక్యంగా ప్రాజెక్టు డైరెక్టర్‌ను ముట్టడించి తమ నిరసనను తెలియజేశారన్నారు. దీంతో దిగివచ్చిన ప్రాజెక్టు డైరెక్టర్ చర్చలకు త్వరలో పిలుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా తిరిగి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమ్మె కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి, చర్చలకు వెంటనే పిలిపించి, డిమాండ్ల విషయంలో సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అధ్యక్షులు సూర్యకుమారి, హసీనా, జోష్ణ, రమాదేవి, సరిత, భవాని, ధనపాల్, వేణు, శివకుమార్, కాంత్, కంచి మాధవయ్య, ప్రదీప్ కుమార్, ముని కష్ణయ్య, ఎన్.బి. రమేష్, ముని కష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...!

12వ రోజుకు పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. గూడూరు మున్సిపల్ కార్యాలయం ముందు పోరాడదాం.. పోరాడదాం అంటూ నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి మానుకోవాలన్నారు. వారేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మాత్రమే నెరవేర్చమని కోరుతున్నారన్నారు. అప్పటివరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మున్సిపల్ జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్,నాయకులు జోగి శివకుమార్, ఎస్.సురేష్, బి.రమేష్, ధారా కోటేశ్వరరావు, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

– వెంకటగిరిలో సిఐటియు నాయకులు వడ్డేపల్లి చెంగయ్య, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు టి.సుబ్బయ్య, ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.

– పుత్తూరు టౌన్‌లో టిడిపి నగరి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. టిడిపి నాయకులు గాలి జీవరత్ననాయుడు, ఎన్ఎన్ ధనపాల్, గంజి మాధవయ్య, ఎఐటియుసి నాయకులు మహేష్ పాల్గొన్నారు.



వెంకటగిరిలో..

సంక్రాంతికి 'స్పెషల్'

233పైగా అదనపు బస్సులు
'ప్రత్యేక'ం పేరుతో జేబుకు చిల్లు



ప్రజాశక్తి-తిరుపతి సిటి

సంక్రాంతి పండుగ, సెలవులను దృష్టిలో ఉంచుకుని ఏపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు 233 పైగా స్పెషల్ బస్సులను నడపనుంది. కానీ స్పెషల్ పేరుతో ప్రయాణీకుల నుంచి భారీ స్థాయిలో ఛార్జీలను వసూళ్లు చేయనుంది. దీంతో పండగకు సొంతూర్లకు వచ్చే వారికి ప్రయాణంలోనే జేబులకు చిల్లులు పడేలా ఉండడం గమనార్హం.

సంక్రాంతి పండుగ. తెలుగువారికి అత్యంత ప్రముఖమైన పండుగ. బోగి, సంక్రాంతి, కనుమ, పశువుల పండుగ వరుసగా నాలుగు రోజుల పాటు జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ అంటే అందరికీ మక్కువ. అందుకు కారణం లేకపోలేదు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో బతుకు దెరువు కోసం జీవిస్తున్న వారు సంక్రాంతి (పెద్ద పండుగ)కి సొంతూర్లకు వస్తుంటారు. కొత్త అల్లుళ్లు, కోడళ్లు, అత్తలు, మామలు, మరదలు, బావమర్దులు, అన్నదమ్ములు, అక్కచెల్లెలు అందరూ ఒక చోట చేరి పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పండుగకు రెండు రోజుల ముందే దూర ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో నివసించే వారు వారి గ్రామాలకు వస్తుంటారు. దీంతో బస్సుల్లో, రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 డిపోల ద్వారా మద్రాసు, కోయంబత్తూరు, బెంగుళూరు, మైసూరు, హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణం, అనంతపురం, కర్నూలు, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు సుమారు 233కిపైగా ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ప్రత్యేక సర్వీసులు ఇవ్వడం ద్వారా ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టు బస్సులను నడిపి వారికి రవాణా సౌకర్యం కల్పిస్తూనే, ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవడం పరిపాటే. కానీ ఆర్‌టిసి అధికారులు మరో అడుగు ముందుకేసి, ప్రత్యేక సర్వీసులకు 1.1/2 వంతెన చార్జీలు వసూళ్లు చేయనున్నారు.

బస్సు సర్వీసు	మామూలుగా(స్లీపర్)	ప్రత్యేకం (స్లీపర్)
తిరుపతి–హైదరాబాద్	1400–1800	2100–2500
తిరుపతి–విజయవాడ	స్లీపర్ 980	1380
	సిట్టింగ్ 780	1050

ప్రయాణికులను ఆకర్షించేందుకు 'ప్రయివేట్'

ఆర్‌టిసి బస్సులే కాదు, ప్రయివేట్ సర్వీసులు సైతం రద్దీని దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచనున్నాయి. సాధారణంగా తిరుపతి–హైదరాబాదు మధ్య స్లీపర్ రూ.1200 నుంచి 1800 వరకు ధర ఉంది. రద్దీ సమయంలో రూ.1600 నుంచి 2200 వరకు వసూళ్లు చేస్తుంటారు. తిరుపతి–విజయవాడ, తిరుపతి–బెంగుళూరు బస్సుల్లో సైతం ఆర్‌టిసితో పోల్చుకుంటే కొన్ని ప్రయివేట్ సర్వీసుల్లోనే అరాకొర తక్కువ చార్జీలు వసూళ్లు చేస్తుండడం గమనార్హం.

ప్రయాణీకులకు సురక్షితమైన రవాణా, భద్రతతో కూడిన ప్రయాణం, తక్కువ ధరలకు అందించాలనే ఏర్పాటు చేసిన ఏపిఎస్ ఆర్‌టిసి ప్రభుత్వ సంస్థలో ఆదాయమే ధ్యేయంగా ప్రయాణీకుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేసేందుకు పూనుకోవడం శోచనీయం. ఆర్‌టిసి అధికారులు సంక్రాంతి ప్రత్యేక సర్వీసుల్లో అదనపు చార్జీలు వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకుని, ప్రయాణీకులకు అవసరాలకు దగ్గ విధంగా సర్వీసులు నడపాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవడం వెనుక..
బిజెపి 'కమీషన్ల' నాటకం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సనాతన ధర్మం పేరుతో స్త్రీలను వంటింటి కుందేళ్లుగా మార్చాలని కుట్ర చేస్తున్న బిజెపి, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో సైతం అబివృద్ధికి మోకాళ్లు అడ్డుకుంటోంది. కొంత మంది నాయకులు స్వార్థంతో కమీషన్ల కోసం కోర్టు కేసులు వేస్తున్నారన్న విమర్శలున్నాయి.

'భారతదేశం దేవుళ్లకు పుట్టినిల్లు. దేశం మొత్తం హిందువులదే. ప్రతి గుడిని పవిత్రంగా చూద్దాం. భక్తుల సకల సౌకర్యాల కల్పనకు కృషి చేద్దాం. సనాతన ధర్మాన్ని కాపాడుదాం' అంటూ నిత్యం వల్లెవేసే భారతీయజనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవుడి పేరుతో ఇతర మతాలపై దాడులు చేయడం నిత్యకృత్యంగా ఉంది. తిరుపతి నాయకులు మరో అడుగు ముందుకేశారు. నిత్యం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి పేరు వల్లిస్తూనే, ఆయన్ని అడ్డం పెట్టుకుని కోట్లు దోచేస్తున్నారు. మరికొంత మంది ఆయన భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు పూనుకున్నా, భక్తుల సౌకర్యార్థం నగరాభివృద్ధిని చేయాలన్న తీర్మానానికి మోకాలడ్డి, కమీషన్ల కోసం కోర్టు కేసులు వేస్తున్నారని ప్రజలే బహిరంగంగా విమర్శలు చేస్తుండటం గమనార్హం. విస్తరిస్తున్న తిరుపతి అబివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, పెరుగుతున్న శ్రీవారి భక్తుల రాకపోకలకు అనుగుణంగా నగరాభివృద్ధికి సహకరించాలని తిరుపతి కార్పొరేషన్ అధికారులు టిటిడికి మొరపెట్టుకున్నారు. అందుకు పాలకమండలిలో చర్చించి, టిటిడి బడ్జెట్‌లో ఒక శాతం నిధులను తిరుపతి అబివృద్ధికి కేటాయించాలని నిర్ణయించారు. అందుకు చర్యలు సైతం తీసుకున్నారు. కానీ తిరుపతి అబివృద్ధి, భక్తుల సౌకర్యాలు ఏమాత్రం నచ్చని బిజెపి నాయకులు దీన్ని వ్యతిరేకిస్తూ సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టులో కేసులు వేశారు. టిటిడి బోర్డులో సాక్షాత్తు నలుగురు బిజెపి పార్టీకి చెందిన సభ్యులే ఉన్నారు. వారు కూడా నిధుల విడుదలకు అంగీకరించారు. కానీ స్థానిక నాయకులు, అది కూడా గతంలో పాలమండలి సభ్యులుగా పని చేసిన వ్యక్తే దీన్ని అడ్డుకోవడం శోచనీయమని తిరుపతి ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఆయన పాలకమండలి సభ్యులుగా ఉన్నప్పుడు ప్రతి రోజూ ఉదయం 3 గంటలకే శ్రీవారి ఆలయం వద్ద ప్రత్యక్షమయ్యేవారు. స్వామిపై భక్తిపేరుతో కార్పొరేట్ వ్యక్తులకు దర్శనాలు కల్పిస్తూ దళారీగా మారిన విషయాన్ని మరిచిపోయారా అంటూ బిజెపికి మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీ నాయకులే విమర్శలు గుప్పిస్తున్నారు. బిజెపికి ఇది తొలి కాదు గతంలో టిటిడి ఉద్యోగులకు ఇళ్ల స్థలాల విషయంలోనూ కోర్టు కెళ్లింది. శ్రీనివాస సేతు (గరుడ వారధి) నిర్మాణంలో తమకు కమీషన్లు ఇవ్వలేదని, శ్రీవారి నామాలు రోడ్లపై వేస్తారా అంటూ హైకోర్టు తలుపు తట్టింది. కోర్టు మొట్టికాయలు వేయడం, స్థానిక ప్రజల ఆగ్రహానికి గురికావడంతో వెనక్కి తగ్గారు. ఎన్నికల వేళ ఇలా దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగడాన్ని స్థానికులే వ్యతిరేకిస్తూ, ఆగ్రహాన్ని వెలగక్కుతున్నారు. పార్టీలు, కమీషన్ల కథ దేవుడెరుగు, మొదట స్థానికులు అనే విషయాన్ని వారు గుర్తు పెట్టుకుని, తమ ఊరు అబివృద్ధికి సహకరించాలని, పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు హెచ్చరించాయి. కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా తిరుపతి నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి, నగరాన్ని ఆదర్శంగా నిలపాలని మేధావులు హితవు పలుకుతున్నారు.



డాక్టరేట్‌ను స్వీకరించిన ప్రిన్సిపల్ సుప్రజ

సుప్రజకు డాక్టరేట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఆర్పీపీ గురుకులం ప్రిన్సిపాల్ సుప్రజకు గౌరవ డాక్టరేట్ లభించింది. గణిత విభాగంలో 'ఫ్లూయిడ్ డైనమిక్స్' అనే అంశంపై సుప్రజ జరిపిన పరిశోధనలకు అనంతపురానికి చెందిన జేఎన్టీయూ యూనివర్సిటీ ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. జేఎన్టీయూ స్నాతకోత్సవ సందర్భంగా గవర్నర్ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా సుప్రజకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సుప్రజకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం

ప్రజాశక్తి-తడ: మండలంలోని కారూరు గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్, తడ మండలం జె సి ఎస్ కన్వీనర్ ఆర్ కే సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కారూరు గ్రామ పంచాయతీ సర్పంచ్, తడ మండలం జెసిఎస్ కన్వీనర్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని వారి ఆరోగ్యపరమైన పరిస్థితులు పరీక్షించుకుని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం తడ మండలం ఎంపీడీవో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంచి మనసుతో ఎంతో దూర దృష్టితో చేస్తున్న కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తడ మండల అధ్యక్షులు రఘు రెడ్డి , వైసిపి తడ మండలం యువజన అధ్యక్షులు తిరుమలరెడ్డి ,కారూరు గ్రామ సచివాలయ కన్వీనర్ మురుగన్ రెడ్డి, స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- నారాయణవనం: నారాయణవనం మండల పరిధిలోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అవధాని ఉప్పల దడియం భరత్ శర్మచే అష్టావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు మనోహరి అధ్యక్షత వహించగా పూర్వ విద్యార్థులు వేడియం భాస్కర్, నాగేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం రెడ్డి, కాళప్ప పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, సుబ్బరాజు, బలరామయ్య, రాజా, ధనుంజయులు , గోపి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు 94 ఏళ్ల సామా మునికృష్ణయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నారాయణవనం: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం, ఆయన కుమారుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్‌తో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై వారి మధ్య చర్చకు వచ్చాయి. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించారు.

గ్రంథాలయం ఏర్పాటు

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబి పురం మండలంలోని కలత్తూరు లో శనివారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల చైర్మన్ మధులత విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతమైన కలతూరు గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఉండడం వల్ల గ్రామ ప్రజలకు విద్యార్థులకు యువతకు ఎంతో ఉపయోగపరంగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మీ , నందకుమార్, లోకనాథ్ రెడ్డి గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఉల్లాసంగా నో బ్యాగ్ డే

ప్రజాశక్తి-తొట్టంబేడు : మొదటి, మూడవ శనివారం పాఠశాల లో జరిగే నో బ్యాగ్‌డే వల్ల పిల్లలు మానసిక, శారీరక దారుఢ్యం పెరుగుతుందని దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, భవిష్యత్ లో ఎదురయ్యే ఎటువంటి ఒడిదుడుకులైనా ఎదుర్కొనేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిల్లలు చిత్ర లేఖనం, పద్యపఠనం, కథలు చెప్పడం, గేయాలు, ఆటల పోటీలు, సృజనాత్మక కృత్యాల్లో పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీలో నిర్వహించిన ఖాదర్ వలి గంధ మహోత్సవానికి నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ , చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవ, చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి మహమ్మద్, ముస్లిం మైనారిటీ సోదరులు స్టేట్ ఉపాధ్యక్షులు ఖాజా పీర్ నగరి నియోజకవర్గం అధ్యక్షులు రఫీ అహ్మద్, భాను ప్రకాష్ హాజరయ్యారు. ముస్లిం మత పెద్ద తో ప్రార్ధనలు చేయించారు. మహమ్మద్ ప్రవక్త ఆశీర్వాదానికి ఖచ్చితంగా వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో. చిత్తూరు పార్లమెంట్ ఆర్గనైజ్ సెక్రెటరీ సర్దార్, పుత్తూరు టౌన్ ప్రసిడెంట్ ముహమ్మద్ రఫీ, హమీద్ బాషా, నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రెటరీ శంషు, ఇక్బాల్, జాబీర్ బాష, తురబ్ బాష, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఉష్ణోగ్రత ఉంటేనే అధిక మామిడి పూత

ఉద్యాన అధికారి శైలజ

ప్రజాశక్తి-పాకాల: రాత్రి, పగలులో పది డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు మాత్రమే మామిడి చెట్టులో పూత బాగా వస్తుందని ఉద్యాన అధికారి శైలజ అన్నారు. మొగరాల పంచాయతీలోమామిడి తోటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి శైలజ మాట్లాడుతూ రాత్రి, పగటి ఉష్ణోగ్రతల మధ్య తేడా10 డిగ్రీల కంటే తక్కువ ఉన్నపుడు మాత్రమే మామిడిలో పూత వచ్చే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుందన్నారు.

బస్టాండ్ ఇక్కడ.. బస్సు ఎక్కడ?

- మరమ్మతులకు నోచుకోని బస్టాండ్
- అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి-కెవిబిపురం: కెవిబిపురం మండల ప్రయాణికుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పర్యవేక్షణ కొరవడడంతో నిరుపయోగంగా మారింది. దీంతో బస్టాండుకు బస్సులు రాక ప్రయాణి కులు రోడ్లపైనే గంటలు తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారుల స్పందన లేకపోవడంతో బస్టాండు ప్రయాణికులు లేక వెల వెలపోయింది. అటు బస్సులు రాక, ఇటు ప్రయాణికులు లేక బస్టాండు పచ్చిక, పిచ్చి మొక్కలతో కనిపిస్తోంది.

కెవిబిపురం మండల కేంద్రంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలకు కెవిబి పురం వచ్చి బస్సు ఎక్కాల్సి వుంది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని 2009లో సుమారు 30 లక్షల రూపాయల వ్యయం తో బస్టాండ్ నిర్మిం చారు. ఆ తర్వాత ప్రజలకు, ప్రయాణి కులకు ఈ బస్టాండు ఎంతగానో ఉప యోగ పడింది. ఆ తర్వాత అధికారుల నిర్లక్ష్యం కార ణంగా



బస్టాండ్ లేక రోడ్లపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు



చెత్త చెదారంతో నిండిన బస్టాండ్

బస్సులు రాకపోకలు ఆగిపోయాయి. క్రమంగా బస్టాండ్ చెత్తాచెదారంతో అధ్వాన స్థితికి చేరుకుంది. అప్పటి నుండి ప్రయాణికులకు నిలవడానికి నీడ కరువైంది. కూర్చో వడానికి చోటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టు న్నారు. మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నా యి. అందులో ఒక్కొక్క పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి ఆ విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళుతుంటారు. బస్టాండ్ లేకపోవడంతో విద్యార్థులు బస్సులు వచ్చే వరకు రోడ్లపై అటు ఇటు తిరుగుతూ ప్రమాదాలకు గురవుతు న్నారని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళ నలకు గురవు తున్నారు.



చెట్ల కిందే నిలబడాల్సి వస్తోంది..

బస్టాండ్ లేకపోవడం వల్ల చెట్లు కిందే షాపుల వద్ద నిలబడుకుంటూ కూర్చోవడానికి స్థలం లేక బస్సు వచ్చే వరకు నిలబడాల్సి వస్తోంది. ఆ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.. వర్షాకాలం వస్తే వర్షం లో తడుస్తూ గొడుగులు పట్టుకుని నిలవడానికి చోటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..

- ఈశ్వరయ్య, ప్రయాణికుడు.



బస్టాండుకు మరమ్మతులు చేయాలి

విద్యార్థులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ మరమ్మ తులు గుర్తై సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పట్టించు కోకపోవడం అధికారులు, నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చాలా బాధాకరం. అధికారులు వెంటనే స్పందించి మండల కేంద్రంలో బస్టాండుకు మరమ్మతులు చేసి ప్రతి బస్సును బస్టాండ్ ఆవరణకు వచ్చి ప్రయాణి కులను తీసుకుని వెళ్లేలా చూడాలి.

- నాగరాజ్, ప్రయాణికుడు.

మండలంలో 10 మంది బైండోవరు

తహశీల్దారు కార్యాలయానికి అప్పగింత

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 పంచాయ తీలలో రోజువారి లాగానే శనివారం 10 మంది బైండోవర్లను పోలీస్ సిబ్బంది గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారి వద్ద నుండి ఆధార్ కార్డు, పాస్‌పోర్టును తీసుకొని అవి జత చేసి వారికి ఎస్ఐ వెంకట నరసింహం అవగాహన కల్పించి వారిని పోలీసు సిబ్బంది ద్వారా తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడుకు అప్పగించారు. డిప్యూటీ తహశీల్దారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వీధుల్లో ఏ ఒక్కరైనా ఎలాంటి గొడవలకు పాల్పడినా, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినా, ఎవరితో ఘర్షణ పడినా నలభై మందిని పోలీస్ సిబ్బంది కఠినంగా శిక్షిస్తారని ఎలక్షన్ సమయంలో ఎవరి పని వాళ్ల చేసుకుంటూ ఘర్షణలు లేకుండా చూడాలన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గతంలో ఘర్షణ కేసులు నమోదు అయిన వారిని గుర్తించి ఈ అవగాహన నిర్వహిం చామన్నారు. ఇకనైనా ప్రతి పంచాయతీలోని ప్రజలు ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలకు పాల్ప డకుండా ఉండాలని సలహాలు సూచనలు ఇస్తూ హెచ్చరించారు.



బైండోవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ

పజాశక్తి -ఏర్పేడు: బ్యూటిషన్ కిట్ రాష్ట్రీయ సేవా సమితి వ్యవస్థాపకులు పద్మశ్రీ గుత్తా మునిరత్నం జయంతి సందర్భం గా రాస్ మహిళ భారతి జన శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాపా నాయుడు పేట కార్యాలయం లో ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ రాజశేఖర్ నాయుడు , వేణుగోపాల్ చౌదరి, రాస్ జనరల్ బాడీ మెంబర్, పాపానాయుడు పేట సర్పంచ్ లలిత కరుణాకర్ , కమిటీ చైర్మన్ తంబా సుబ్రహ్మణ్యం, ఎం హరిబాబు, ప్రోగ్రాం ఆఫీసర్ జన శిక్షణ సంస్థ, సి బాలాజీ రెడ్డి ప్రాజెక్ట్ అధికారి రాస్ మహిళా భారతి, డ్రగ్ అండ్ డి ప్రాజెక్టు అధికారి అన్నా దొరై పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రాస్ జన శిక్షణా సంస్థ ప్రతినిధులు

పార్థు కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేతకు ఘన సన్మానం

ప్రజాశక్తి -రేణిగుంట : రాయలచెరువు పార్థు కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్‌డి సుబ్రహ్మణ్యం రెడ్డి చేస్తున్న సేవలు అమోఘమని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి పేర్కొన్నారు. రేణిగుంట మండలంలోని విప్పమానుపట్టెడ గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సంవత్సర సందర్భంగా ఆర్‌డి సుబ్రహ్మణ్యం రెడ్డిని విప్పమానుపట్టెడ గ్రామ పంచాయతి సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి, గ్రామ సచివాలయం సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి మాట్లాడుతూ ఆర్ డి సుబ్రమణ్యం రెడ్డి సేవా దృక్పథం కలిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాయల్ చెరువు పార్థు కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామానికి చేస్తున్న సేవలు అమోఘమని అన్నారు. సేవా దృక్పథం కలిగిన ఆర్డి సుబ్రహ్మణ్యం రెడ్డిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ఆయన మరెన్నో సేవలు చేయాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడం కోసం రాయల్ చెరువు పార్థు కిరణ్ వైద్యశాల ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వైద్యశాలలో గ్రామ ప్రజలే కాకుండా పక్క మండలాలు నుండి కూడా ప్రజలు వచ్చి వైద్యాన్ని పొందుతున్నారని తెలిపారు. అనంతరం ఆర్ డి సుబ్రహ్మణ్యం రెడ్డికి నూతన డైరీనీ అందించారు. ఈ సందర్భంగా ఆర్డి సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో గ్రామ పంచాయతీని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంచాలని ఆకాంక్షించారు. గ్రామానికి సేవ చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రాయల్ చెరువు పార్థు కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



పార్థు కిరణ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేతను సన్మానిస్తున్న సర్పంచ్

నూతన టెక్నాలజీతో పరంఫేవర్స్ రోడ్డు

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నూతన టెక్నాలజీతోపర ఫేవర్స్‌రోడ్డు నిర్మాణం సాగుతోందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పేర్కొన్నారు. రహదారుల నిర్మాణంలో నూతన టెక్నాలజీతో తిరుపతి నవోదయ కాలనీలో నిర్మిస్తున్న పరంఫేవర్స్ రోడ్డు నిర్మాణ పనులను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, తిరుపతి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ నవోదయ కాలనీలో 330 మీటర్ల పొడవుతో ఆధునిక నూతన టెక్నాలజీతో మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. పరంఫేవర్స్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రోడ్డుపై వర్షం నీరు నిలబడదని, మొత్తం నీరు రోడ్డు పీల్చుకోవడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు నిల్వ వుండేందుకు ఎక్కువ అవకాశం వుందన్నారు. ఈ నూతన టెక్నాలజీతో రూ.53 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు వల్ల పూర్తి ప్రయోజనం కలిగితే, మరిన్ని పరంఫేవర్స్ రహదారుల నిర్మాణాలు చేపడుతామన్నారు. తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలను కౌన్సిల్ అనుమతితో చేపడుతామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చెన్నారెడ్డి కాలనీలో నిర్మిస్తున్న రహదారిని, 35వ వార్డు భవాని నగర్‌లో టీటీడీ పరిపాలనా భవనం పక్కన రైల్వే కాలనీ వైపునకు వెళుతున్న రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ సంజీవ్ కుమార్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి, మార్కెట్ మునిరామి రెడ్డి, దినేష్ రాయల్, మూలం అశోక్ రెడ్డి, శ్యామల, రాఘవులు, బాలాజీ, నాధముని, నారాయణ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేయక పోవడం బాధాకరం

-కన్నావరం హరిబాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సామాజిక భద్రత ఫించన్లు సకాలంలో పంపిణీ చేయక పోవడం బాధాకరమని టీడీపీ గాండ్ల, తెలికుల రాష్ట్ర సాధికారిక కమిటీ సభ్యులు కన్నావరం హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలలో ఇప్పటికే ఆరు రోజులు గడచి పోయినా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో లబ్ధిదారులకు సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ చేయలేదన్నారు. ఈ కారణంగా వృద్ధులు, వితంతువులు, ప్రత్యేక ప్రతిభావంతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మంది పింఛను సొమ్ముతో జీవనం గడుపుతున్నారని కన్నావరం హరిబాబు తెలిపారు. ఇలాంటి వారికి సకాలంలో పింఛను అందించక పోతే వారి జీవనం ఎలా గడవాలని ఆయన ప్రశ్నించారు. శ్రీకాళహస్తిలో శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి అందుబాటులో లేరనే సాకుతో పింఛన్లు పంపిణీ ఆలస్యం చేయడం న్యాయం కాదన్నారు. సామాజిక భద్రత పింఛను కూడా రాజకీయ ప్రచారానికి వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు పింఛను పెంచి తామేదో గొప్ప పని చేసినట్లు అధికార పార్టీ నాయకులు డాంబికాలు పలుకుతు న్నారన్నారు. జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముందే పింఛను ఎందుకు పెంచలేదని ఆయన ప్రశ్నించారు. అధికారులు ఇకనైనా స్పందించి లబ్ధి దారులకు సామాజిక భద్రత పింఛను వెంటనే పంపిణీ చేయాలని డిమాండు చేశారు.

పోటీ పరీక్షలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రజాశక్తి -తొట్టంబేడు: స్థానిక శ్రీ కాళహస్తి పట్టణంలోని ధర్మ రాజుల స్వామి గుడి ఎదురుగా ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచ్ -3 విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగిన ఒలింపియాడ్ ఐఎన్‌టిఎస్ఓ పరీక్షలలో మంచి ఫలితాలతో ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏజీఎం సురేష్ మాట్లాడుతూ పోటి పరీక్ష ఏదైనా ఫలితాలల్లో శ్రీ చైతన్య విద్యార్థులకు మరెవ్వరూ సాటి రాలేరని తెలిపి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఐఎన్‌టిఎస్ఓ పరీక్షలో తమ బ్రాంచ్ నుండి 167 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 163 మంది విద్యార్థులు లెవెల్ -2కి అర్హత సాధించడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. పోటీ పరీక్షలలోనే కాకుండా ఆట, పాటలలో కూడా ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ తో శ్రీ చైతన్య సంస్థ ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ కేదార్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

హస్తకళల ఉత్పత్తులను ఆదరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని డివిఆర్ హాస్పిటల్ మార్గంలోని డిపిఆర్ కన్వెన్షనల్ హాలులో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన లేపాక్షి కాటన్ అండ్ సిల్క్ మేళా తిరుపతి నగర ప్రజల తోపాటు యాత్రికులను ఆకట్టు కుంటుందని లేపాక్షి మేనేజర్ బిపి. వెంకటేశమ్ తెలిపారు. సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్క రించుకొని అన్ని వయస్కుల వారికి కావలసిన హస్తకళ ఉత్పత్తులను మేళాలో అందుబాటులో ఉంచామన్నారు. వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది హస్తకళాకారులు తయారుచేసిన వస్త్రాలు, వస్తు ఉత్పత్తులను మంచి ధరలతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. హస్త కళాకారులు తమ నైపుణ్యాన్ని జోడించి నవ్య నూతన చీరలు, ఖాది, బెడ్ షీట్లు వంటి వాటిని తయారు చేసి ప్రత్యేక స్థానం ద్వారా అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఈనెల 12తో మేళా ముగియనుందని హస్తకళ ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేయాలని తిరుపతి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



వస్తు ఉత్పత్తులను పరిశీలిస్తున్న మహిళలు

స్వార్థ ప్రయోజనాల కోసమే దళితుల్లో కలహాలు

వైసిపిపై టిడిపి ఎస్‌సి సెల్ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-పాకాల: మండలంలో వైసిపి ప్రభుత్వ నాయకులు దళిత వాడల్ని టార్గెట్ చేస్తూ కలహాలు సృష్టించడం తగదని ఎస్సీ సెల్ చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షులు పాటూరు మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. పాకాల టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాటూరు మోహన్ మాట్లాడుతూ ఎప్పుడూ లేనివిధంగా ప్రశాంతంగా ఉన్న పాకాల మండలంలో దళిత వాడల్ని వైసిపి ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని, ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గంలో తన స్వార్ధ ప్రయోజనాల కోసం దళితులకు కండువాలు కప్పి కలహాలను సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ స్వార్ధ ప్రయోజనాల కోసం దళితుల్లో కలహాలు రేపి గ్రామస్థాయి నుంచి ప్రోత్సహి స్తున్నారన్నారు. అధికార బలంతో అధికారులను అడ్డంపెట్టి సంఘమిత్రాలు,ఫీల్డ్ అసిస్టెంట్లు,వాలంటీర్ల ద్వారా గ్రామాల్లో అభం శుభం తెలియని అమాయకులను కండువాలు కప్పి పార్టీలో చేరకపోతే మీకు వచ్చే ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసి వేస్తామని బెదిరించడం దారుణమని అన్నారు. దళితుల్లో దళితులకే కలహాల సృష్టిస్తున్న అధికార పార్టీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు సైతం పాల్పడుతున్నారని అధికార పార్టీ నాయకులు, ఇప్పటికైనా వీటిని మానుకోక పోతే అధికారులు, నాయకులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో దళితులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

టీచర్స్ ఎమ్మెల్సీ త్వరగా కోలుకోవాలని పూజలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఎస్వీయూ అకాడమీ కన్సల్టెంట్ అధ్యక్ష, కార్యదర్శులు అలిపిరి పాదాల వద్ద 101 కొబ్బరికాయలను కొట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు కిషోర్ రెడ్డి, కిషోర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని ఉపాధ్యాయ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థించామన్నారు. ఆయన ఆరోగ్యం కుదుటపడి త్వరలో అందరిని కలిసి సంతోషంగా తమ విధులను తాము నిర్వర్తిం చాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు ప్రవీణ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, అకాడమిక్ కన్సల్టెన్సు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి- రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలోని పలు ప్రముఖ కంపెనీలలో నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు వున్నాయని ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత లోకేష్ రెడ్డి తెలిపారు. ఎంఆర్ ఎంటర్ప్రైజెస్ అధ్వర్యంలో నేటి నుండి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని లోకేష్ రెడ్డి తెలిపారు. విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా కలిగి ఉండివయస్సు 19నుండి 25సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. జీతం 12వేలు రూపాయల నుండి 15 వేలు రూపాయలు వరకు వుంటుందని, బస్సు, భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704459538, 9000507004, 7975523308 ఫోను నెంబర్లను సంప్రదించాలని కోరారు.




కర్నాటక మంత్రిని ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు చిట్టిబాబు

ఏపీలో కాంగ్రెస్‌దే అధికారం: కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజా రిటీతో అధికారాన్ని హస్త గతం చేసుకుం టుందని కర్ణాటక రాష్ట్ర సివిల్ సప్లై, ఫుడ్ అండ్ కన్జ్యూ మర్ ఎఫైర్స్ శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీవారి దర్శనార్థం శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంత్రి మునియప్పకు ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు సాధరంగా ఆహ్వానం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మునియప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల సారథ్యంలో పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి అవసరమైన కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల సైతం కాంగ్రెస్‌లోకి వచ్చారన్నారు. ఇది కాంగ్రెస్‌కి శుభ పరిణామమన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో 14న భోగి తేరు, 15న మకరసంక్రాంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జనవరి 14న భోగితేరు, జనవరి 15న మకరసంక్రాంతి పర్వదినాలు జరగనున్నాయి. జనవరి 14న భోగి పండుగ రోజున సాయంత్రం 5.30 నుండి రాత్రి 7 గంటల వరకు శ్రీ ఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామిని భోగితేరుపై కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహిస్తారు. జనవరి 15న మకర సంక్రాంతి సందర్భంగా ఉదయం సంక్రాంతి తిరుమంజనం చేపడతారు. ఉదయం 6.30 గంటలకు ఆలయం నుండి చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా కపిలతీర్థంలోని శ్రీఆళ్వార్ తీర్థానికి వేంచేపు చేస్తారు. అక్కడ చక్రస్నానం అనంతరం ఆస్థానం చేపడతారు. సాయంత్రం 5.30 నుండి రాత్రి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఎస్‌వియు ఉపకులపతిని సన్మానిస్తున్న, ఎమరాల్డ్స్ విద్యా సంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్

ఎస్‌వియు ఉపకులపతికి ఘన సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నూతనంగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన శ్రీకాంత్ రెడ్డిని తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ విద్యా సంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ కలసి ఘనంగా సత్కరించారు. ఎంతో మంది మేధావులను సమాజానికి అందించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంకు ఉపకులపతిగా శ్రీకాంత్ రెడ్డి నియమితులు కావడం హర్షించదగ్గ విషయమని ఎమరాల్డ్స్ డైరెక్టర్లు తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి హయాంలో వర్సిటీ మరింత ఖ్యాతిని గడించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో ఎమరాల్డ్స్ విద్యాసంస్థల ఉపసంచాలకులు పాల్గొన్నారు.